క్లుప్తంగా

సన్యాసిరావు కుటుంబానికి పరామర్శ


సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలో గల సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు సోదరుడు సన్యాసిరావు కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ ఎ.సుభద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ, సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ చంటిబాబు రాజు, దంతులూరి దిలీప్ కుమార్, కొయ్య ప్రసాదరెడ్డి, సతీష్‌వర్మ, జెడ్పీటీసీలు పైల సన్యాసిరాజు, పలు మండలాల జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పరామర్శించారు. సన్యాసిరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా బుధవారం ఆయన సంతాప సభ వడ్డాదిలో జరిగింది. సన్యాసిరావు మృతి పార్టీకి తీరని లోటని అతని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధర్మశ్రీ తెలిపారు.

విజయవాడ వరద బాధితులకు వితరణ

మాడుగుల రూరల్ : విజయవాడ వరదబాధితులుకు కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూలు కమిటీ చైర్మన్, సభ్యులు తమ వంతుగా ఆర్థిక సహాయం అందించారు. బుధవారం వీరంతా కలిసి రూ.10,902 నగదు సహాయం అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించడానికి హెచ్ఎం వి.దాసు, స్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్‌కు సంబంధిత నగదును అందజేశారు.

వడ్డాది డైవర్షన్ రోడ్డుపై నుంచి రాకపోకలు

బుచ్చెయ్యపేట : మండలంలో గల వడ్డాది పెద్దేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్డు గండిని ఆర్ అండ్‌బీ అధికారులు పూడ్చారు. ఇటీవల వర్షాలకు పెద్దేరు నది ఉప్పొంగి డైవర్షన్ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించి గండి పడింది. గండిని రాయి బుగ్గి, గ్రావెల్ వేసి అధికారులు పూడ్చారు. డైవర్షన్ రోడ్డు బాగు పడడంతో బుధవారం మధ్యాహ్నం నుంచి డైవర్షన్ రోడ్డుపై నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

కేంద్ర పథకాలపై అవగాహన


మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ అధికారి నాగ శిరీష

మాడుగుల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గిరిజన సంక్షేమ అధికారి నాగ శిరీష పేర్కొన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శంకరం పంచాయతీ శివారు బొడ్డేవు, కొత్తవలస గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. సర్పంచ్ శోలం రమేశ్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 22 పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎంపీపీ రాజారామ్ మాట్లాడుతూ అందరికీ విద్య, రహదారుల నిర్మాణం, ప్రతి ఇంటికి విద్య వంటివి అందిస్తున్నారన్నారు.

పోతనవలసలో ఆరోగ్య తనిఖీలు

కె.కోటపాడు : వర్షాకాలం కావడంతో ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా ప్రజలు జాగ్రత్తలను తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. పోతనవలస గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను బుధవారం నిర్వహించారు. 119 మందికి ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు ఇచ్చారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి కారణంగా దోమలు వృద్ధి చెందడం ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు వచ్చే పరిస్థితి ఉంటుందని ఆమె వివరించారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు.

ముఠా కార్మికులను ఆదుకోవాలి

నర్సీపట్నం: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన ముఠా కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆందోళన చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులైన ముఠా కార్మికులు సుమారు 300 మంది నర్సీపట్నంలో అనేక ఏళ్లుగా పనులు చేస్తూ జీవిస్తున్నారన్నారు. పన్నుల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా, కార్మికులకు ప్రమాద బీమా చెల్లించడం లేదన్నారు.

ఉద్యాన పంటలను కాపాడుకోండిలా..!

- వర్షాలు తగ్గుముఖం
- పంటలకు సస్యరక్షణ చర్యలు అవసరం
- మండల ఉద్యానవనశాఖాధికారి భాను పుష్పలీలావతి


వి.భానుపుష్ప లీలావతి మండల ఉద్యానవన శాఖాధికారి



మాడుగుల రూరల్ : తుపాను వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఉద్యానవన పంటలకు సంబంధించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి ఉద్యానవన రైతులకు సూచించారు. ఆమె మండలంలో పర్యటించి రైతులకు పలు సూచనలు అందజేశారు. ఆమె అందించిన సలహాలివి.

మామిడి తోటలు :

- ఒరిగి, పడిపోయిన చిన్న చెట్లను లేపి, మట్టిని ఎగదోయాలి.
- విరిగిన కొమ్మలు కత్తిరించి, పై భాగాన బోర్డో పేస్ట్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను పూతగా పూయాలి.
- చెట్ల మధ్య దున్ని తేమ ఆవిరి అయ్యేలా చూడాలి.
- ఒక చెట్టుకు 500 గ్రాములు యూరియా, 417 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పోటాష్, 25 కిలోలు పశువుల ఎరువును వేయాలి.
- వేర్లు తెగులు నుంచి కాపాడడానికి కాపర్ ఆక్సీ క్లోరైడ్‌ను 3 గ్రాములు ఒక లీటరు నీటిలో మొదలు వద్ద తడపాలి.
- పక్షి కన్ను తెగులు, పండు కుళ్లు వంటి తెగులు నివారణకు కార్బండిజమ్ ఒక గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నీట మునిగిన కొబ్బరి తోటల్లో..

మొవ్వు కుళ్లు లక్షణాలు :

- తెగులు సోకిన మొక్కల్లో మొదట మొవ్వు ఆకు, దాని పక్కనున్న రెండు లేదా మూడు ఆకులు వడలిపోతాయి.
- **మొవ్వు నుంచి బయటకొచ్చే భాగంలో ఎండుకుళ్లు, ఏర్పడుతుంది. మొవ్వు ఆకు పసుపు రంగుకు మారి ఎండిపోతుంది.**
- **ఇతర పరాన్న జీవులు చేరి మొవ్వు పూర్తిగా చెడు వాసన** వస్తుంది.
- తగిన సమయంలో నివారణ చర్యలు తీసుకోకపోతే ఈ తెగులు కొబ్బరి తోటలకు విపరీతంగా నష్టాన్ని కలిగిస్తుంది.

ఆయిల్‌పామ్ తోటల్లో..

- ఆయిల్‌పామ్ తోటల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా, బయటకు పోయే ఏర్పాటు చేయాలి.
- తేమ ఉన్నప్పుడే 2.5 కిలోలు యూరియా, 3.7 కిలోలు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, రెండు కిలోలు మ్యూరేట్ ఆఫ్ పోటాష్, 500 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్, 100 గ్రాములు బోరాన్, ప్రతి మొక్కకు రెండు దఫాలుగా అందజేయాలి.
- లేత తోటలో మురుగు నీరు పోయే ఏర్పాటు చేయాలి. ఎక్కువ రోజులు నీటిలో మునిగి వున్నట్టయితే మొవ్వు కుళ్లు వచ్చే అవకాశం ఉంది.

మొవ్వు కుళ్లు తెగులు లక్షణాలు

- మొవ్వు ఆకులు మొదట పసుపు రంగులో కనిపించి, క్రమేపీ గోధుమ రంగులోకి మారుతాయి. వ్యాధి సోకిన మొవ్వు అడుగు భాగం కుళ్లి, వంగి కిందికి వేలాడుతుంది. కుళ్లిన భాగం నుంచి విపరీతమైన చెడు వాసన వస్తుంది.
- ఈ కుళ్లును నియంత్రించకపోతే మొక్క చనిపోవడానికి దారి తీస్తుంది.

జీడిమామిడి తోటల్లో..

- **అధిక వర్షాల వల్ల నీట మునిగిన జీడి మామిడి తోటల్లో కోత, క్షయం ఏర్పడడం వల్ల 5 ఏళ్ల కంటే తక్కువ వయస్సు గల తోటల్లో మొక్కలు వంగి పోవడం కొమ్మలు విరిగిపోవడం జరుగుతుంది.**

నివారణ చర్యలు :

- వంగి పోయిన కొమ్మలను, రంపంతో గాని, కోత యంత్రాలతో గాని కోసి, కొమ్మల చివర బోర్డో మిశ్రమం లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ పూతగా పూయాలి.
- వేళ్లతో పెకిలించుకు పోయిన మొక్కల స్థానంలో అధిక దిగుబడులు ఇచ్చే మేలైన రకాలు నాటుకోవాలి. కాండం తొలుచు పురుగు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ మిటరు, ఒక లీటరు నీటిలో కలిపి ద్రావణం పిచికారీ చెయ్యాలి. లేత తోటల్లో మొక్కలు వంగి, ఉన్నట్టయితే వాటిని కర్రలతో ఊతమిచ్చి నిలబెట్టాలి. మొక్క మొదలు మట్టితో కప్పాలి.
- ఈ మొక్కలకు ఒక శాతం పోటాషియమ్ నైట్రేట్ (13-0-45), 2 శాతం యూరియాను వారం రోజులు వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేయాలి.
- మురుగునీరు పోయిన తర్వాత తేమ వున్నప్పుడు 500 గ్రాములు యూరియా, 375 గ్రాములు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 120 గ్రాములు మ్యూరేట్ ఆఫ్ పోటాష్ 5 సంవత్సరాలు, అపై వయస్సు తోటలకు అందించాలని మండల ఉద్యానవనశాఖాధికారి భాను పుష్పలీలావతి పేర్కొన్నారు.

గ్రామాల్లో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించాలి


ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రశేఖర్ దేవ్

కె.కోటపాడు : ఎపిడమిక్ సీజన్ కావడంతో ప్రజలు అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చంద్రశేఖర్‌దేవ్ అన్నారు. లంకవానిపాలెం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రతి బుధవారం, శనివారం రోజుల్లో వ్యాధి నిరోధక టీకాలను వేసే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించే ముందు రోజునే ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులకు తప్పనిసరిగా సమాచారాన్ని ఇవ్వాలని చంద్రశేఖర్ దేవ్ పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో పూర్తి స్థాయిలో మందులను అందుబాటులో ఉంచుకోవడంతో పాటు పీహెచ్‌సీలో జరగాల్సిన అన్ని పరీక్షలను చేయాల్సిందిగా వైద్య సిబ్బందికి సూచించారు. ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందేలా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గణాంక అధికారి రామచంద్రరావు, వైద్యాధికారులు శైలజ, సాయికిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ పాల్గొన్నారు.

డిగ్రీ మూడో విడత అడ్మిషన్లు

నర్సీపట్నం: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. బిఏ(హిస్టరీ)-2, బిఏ(పాలిటిక్స్)-6, బీఎస్సీ(ఫిజిక్స్)-35, బీఎస్సీ(కెమిస్ట్రీ)-7, బీఎస్సీ(కంప్యూటర్ సైన్స్)-9, బీఎస్సీ (బొటనీ)-4 సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 15లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వెబ్‌ఆప్షన్స్‌కు ఈ నెల 18వ తేదీ వరకు అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. నచ్చిన కోర్సు ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 19 వరకు అవకాశం ఉందన్నారు. ఈ నెల 22వ తేదీన సీట్లు కేటాయిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 25 లోపు సర్టిఫికేట్లు కళాశాలలో సమర్పించాలన్నారు.

నాతవరం ఎస్ఐ రామారావు బదిలీ

నాతవరం: నాతవరం ఎస్ఐగా పని చేస్తున్న ఎం.రామారావుకు పరవాడ ఎస్ఐగా బదిలీ అయింది. ఇక్కడకు నర్సీపట్నం రూరల్ ఎస్ఐగా పని చేస్తున్న భీమరాజును నియమించారు. వారం రోజులు క్రితమే భీమరాజుకు బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. రామారావుకు బుధవారం ఉత్తర్వులు వచ్చాయి. రామారావు ఏడాది పాటు నాతవరంలో పనిచేశారు.

ముమ్మరంగా క్లోరినేషన్ పనులు

మాడుగుల రూరల్ : ఇటీవల కురిసిన వర్షాల వల్ల గ్రామాల్లో అంటు వ్యాధులు, ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా, మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామ సర్పంచ్ జామి రమణబాబు పర్యవేక్షణలో వారం రోజులు నుంచి పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు బ్లీచింగ్, క్లోరినేషన్ చేపట్టారు. బుధవారం ఫినాయిలు మురుగు కాలువల్లో పారిశుధ్య కార్మికులు పిచికారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, గుమస్తా, సాహూ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలతో సేంద్రియ ఎరువు


సంపద తయారీ కేంద్రం నిర్వహణపై సూచనలను చేస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు : గ్రామాల్లో గల ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి నిర్దేశిత ప్రాంతాల్లో వేయాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు తెలిపారు. ఆర్లి గ్రామంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద తయారీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రతతో ఉండేటట్టు పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి అనురాధకు సూచించారు. తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువును సంపద తయారీ కేంద్రంలో చేపట్టాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. సంపద తయారీ కేంద్రంలో గల కుండీల్లో ఎర్రలను వేయడం ద్వారా సేంద్రియ ఎరువుగా మారుతుందన్నారు. సేంద్రియ ఎరువును గ్రామానికి చెందిన రైతులకు తక్కువ ధరకే అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, సర్పంచ్ ఈశ్వరమ్మ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక


గాదిరాయి నుంచి ఆస్పత్రికి బస్సు ద్వారా రోగులను తరలిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : దీర్ఘకాలిక రోగులు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖ సమీపంలో గల అనిల్ నీరుకొండ ఆస్పత్రికి బుధవారం తరలించారు. కె.జె.పురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, వీహెచ్‌పీ సారథ్యంలో బుధవారం వీజేపురం, ఒమ్మలి, గాదిరాయి, ముకుందపురం, వంటర్లపాలెం గ్రామాల నుంచి 52 మందిని అనిల్‌నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. కళ్లు, మూల వ్యాధి, గుండె సమస్య, స్త్రీల సమస్యలతో బాధపడుతున్న వారిని తరలించారు. ఈ కార్యక్రమంలో భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు రామకొండలరావు, వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు కరణం దేముళ్లు, పడాల శ్రావణి, శనివాడ అప్పల నర్సింహ నాయుడు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు. శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించి, వారికి ఉచిత భోజన సదుపాయం, రవాణా సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్టు రామకొండలరావు తెలిపారు.

ఐసీఆర్‌పీ సన్యాసమ్మ మృతికి సంతాపం


చీడికాడ: మండలంలోని పెదగోగాడకు చెందిన ప్రకృతి వ్యవసాయం ఐసిఆర్‌పి సన్యాసమ్మ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ప్రకారం మంగళవారం సాయంత్రం సన్యాసమ్మ(40) అస్వస్థతకు గురికావడంతో గ్రామంలో పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి, అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అయితే అప్పటికే ఆమె గుండెపోటుకు గురై మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి పెళ్లికాని కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమె మృతికి మండల ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సంతాపం తెలిపారు.

జగ్గంపేట ఎంపీపీ స్కూల్‌కు టీవీ వితరణ


హెచ్ఎంకి టీవీని అందజేస్తున్న గ్రామ యువత

రోలుగుంట: జగ్గంపేట ఎంపీపీ పాఠశాలకు గ్రామానికి చెందిన యవకులు తమ సొంత నిధులతో రూ.35 వేల విలువ గల టీవీ (దృశ్య శ్రవణ పరికరం)ని హెచ్ఎం కాళింగ సతీష్‌కు అందజేశారు. ఈ పాఠశాల కొంతకాలంగా దాతలు, ఎస్ఎంసీ సహకారంతో అభివృద్ధి చెందుతోంది. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను బళ్లో చేర్పించేలా తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చి పాఠశాలలో చేర్పిస్తున్నారు. పాఠశాలలో వసతులను మెరుగుపరచడానికి గ్రామస్తులు సహకారం అందిస్తున్నారు. కొందరు దాతలు పాఠశాలకు కుర్చీలు అందించారు. పాఠశాల గోడలపై గణితం, సైన్సుకు సంబంధించిన చిత్రాలు వేయించారు. తాజాగా పాఠశాలకు దృశ్య శ్రవణ పరికరం కూడా సమకూర్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో-2 జగ్గారావు మాట్లాడుతూ విద్యార్థులకు మేలైన బోధన అందించాలని సూచించారు. స్థానిక నాయకులు జోగినాయుడు, నరేష్, ఎస్ఎంసీ చైర్మన్ ఆరిశెట్టి దేవి, వైస్‌చైర్మన్ కిరణ్ పాల్గొన్నారు.

ఎస్ఐ నారాయణరావును కలిసిన జెడ్పీటీసీ


ఎస్ఐ నారాయణరావును మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పీటీసీ రమణమ్మ, రాంబాబు

మాడుగుల రూరల్: మాడుగుల నూతన ఎస్ఐ జి.నారాయణరావును స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు కిముదు రమణమ్మ, బుధవారం మర్యాదపూర్వకంగా కలిసారు. రమణమ్మ, కె.వల్లాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్ఐకు శాలువ కప్పి సన్మానించారు.

దేవరాపల్లిలో ఎస్సీ వర్గీకరణ ప్రతిఘటన ర్యాలీ


దేవరాపల్లిలో నిరసన చేపడుతున్న కమిటీ సభ్యులు

దేవరాపల్లి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలన చేయాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రతిఘటన ర్యాలీని దేవరాపల్లిలో బుధవారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రతిఘటన ర్యాలీ అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. మండల కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పుతో ఎస్సీ ఉపకులాలకు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. క్రిమిలేయర్ విధానంతో అటెండర్ ఉద్యోగికి కూడా రిజర్వేషన్లు లేకుండా పోతాయన్నారు. వర్గీకరణకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ను 2/3 వంతు మెజార్టీతో పార్లమెంట్‌లో సవరణ చేయాలన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక

చోడవరం రూరల్ : స్థానిక గణేష్ గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 45 మంది కంటి శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖ శంకర్ ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని బ్రాహ్మణ సంఘం భవనం వద్ద నిర్వహించిన శిబిరానికి 135 మంది రోగులు హాజరయ్యారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విజయవాడ ముంపు

- వరదలపై సమాచారమున్నా ప్రజలను అప్రమత్తం చేయలేదు
- ఈ విలయానికి సీఎం చంద్రబాబు బాధ్యత వహించాలి
- సాక్షితో మాజీ ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



చోడవరం : విజయవాడను ముంచెత్తిన వరదల్లో మరణించిన ప్రతి ఒకటి ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ స్పష్టం చేశారు. నగరాన్ని వరద ముంచెత్తబోతోందని ప్రభుత్వానికి ఇరిగేషన్ శాఖ నుంచి స్పష్టమైన సమాచారం ఉన్నా ప్రజలను అప్రమత్తం చేయడంలో, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. వరదల్లో 60 మంది మృత్యువాత పడితే 2 లక్షల మంది ముంపునకు గురయ్యారని, వీరి మరణాలకు సీఎం చంద్రబాబు, కేబినేట్ మంత్రులు, అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కావాలనే ప్రజల ప్రాణాలను గాలికొదిలేసిన ప్రభుత్వానిది కచ్చితంగా క్రిమినల్ నెగ్లిజెన్సే అని ఆగ్రహించారు. సీఎం చంద్రబాబుకు పబ్లిసిటీ యావ ఎక్కువ..అందుకే రోజుకొక ప్రెస్‌మీట్ పెట్టి పేపర్‌లు, టీవీల ద్వారా పబ్లిసిటీ కోసమే ఆర్రులు చాచారు కానీ ముంపునకు గురైన ప్రజలను రక్షించడంపై శ్రద్ధ చూపలేదన్నారు. బుడమేరు వరదపై నీటి పారుదల శాఖ డీఈ, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా చేసిన భిన్న ప్రకటనలు ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతున్నాయని గుర్తు చేశారు. చంద్రబాబు ఇల్లు మునిగిపోతుందనో లేక ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు చెందిన పవర్ ప్లాంట్ మునిగిపోతుందనే స్వార్థంతోనే బుడమేరు నుంచి నీటిని విజయవాడ వైపు మళ్లించడం వల్లే విజయవాడ, అమరావతి ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. విజయవాడలో వందలాది ఫంక్షన్ హాల్స్, కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాలు అందుబాటులో ఉన్నా, బాధితులను ఎందుకు తరలించలేక పోయారని ప్రశ్నించారు. ఇప్పటికే తమ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించారని, కోటి రూపాయలు విరాళం ప్రకటించారని గుర్తుచేశారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా


ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

నర్సీపట్నం: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఢిల్లీలో అంబేడ్కర్ ఇండియా మిషన్ చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా నర్సీపట్నంలో ఎఐఎం, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం ధర్నా నిర్వహించారు. అబిద్‌సెంటర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఆర్డీవో జయరాంకు వినతిపత్రం అందజేశారు. దళిత కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్ల చలపతిరావు, ఏఐఎం స్టేట్ పొలిట్ బ్యూరో సభ్యులు వీరబాబు, జిల్లా కోకన్వీనర్ సాల్మన్‌రాజు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉన్న సుప్రీంకోర్టు తీర్పు వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎం డివిజన్ కార్యదర్శి మల్లేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, డివిజన్ డిజిటల్ కన్వీనర్ చిరంజీవి, డివిజన్ కోకన్వీనర్ బి.అప్పారావు, గొలుగొండ కన్వీనర్ వరహాలబాబు, కార్యదర్శి అప్పారావు, నర్సింగరావు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ పారదర్శకంగా జరగాలి


మాట్లాడుతున్న ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి. వేదికపై ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో చంద్రశేఖర్

దేవరాపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)ను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అధికారులతో ఉపాధి హామీ పథకం 17వ సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశాన్ని ఎంపీపీ బుల్లిలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సమావేశంలో మాడుగుల క్లస్టర్ ఏపీడీ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 ఆగస్టు వరకు జరిగిన పనులకు సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు. ఎంపీడీవో కె.చంద్రశేఖర్, ఏపీవో డి.చంద్రకళ, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, ఎస్ఆర్పీడి.రాజేంద్రరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు నర్సులను రెగ్యులరైజ్ చేయాలి


ఆస్పత్రి ఎదుట నిరసన చేస్తున్న నర్సులు

చోడవరం రూరల్: ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో 115ను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక సామాజిక ఆస్పత్రిలో కాంట్రాక్టు వర్కర్సు బుధవారం నిరసన చేపట్టారు. కాంట్రాక్టు స్టాఫ్‌నర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.నీరజ మాట్లాడుతూ జీవో నంబర్ 115 ప్రకారం రెగ్యులర్ ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్‌నర్సులుగా నియమించడానికి వీలు కల్పించిందన్నారు. దీంతో ఏళ్ల తరబడి కాంట్రాక్టు పద్ధతిలో స్టాఫ్‌నర్సులుగా విధులు నిర్వహిస్తున్న వారికి నష్టం వాటిల్లుతుందన్నారు. తక్షణం జీవోను రద్దు చేసి కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. నిరసనలో రమాదేవి, రేవతి, గంగాభవాని, రత్నం, గీత, క్రాంతి, నూకరత్న పాల్గొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సహాయ అధ్యక్షుడు శంకరరావు, హెడ్ నర్స్ జయంతి సంఘీభావం తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మేరీ సువార్త

నర్సీపట్నం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు మున్సిపాలిటీ 15వ వార్డు, ధర్మసాగరం గ్రామంలో ప్రారంభించారు. జెడ్పీటీసీ సుకల రమణమ్మ, సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు పోషక కలిగిన ఆహార పదార్థాల స్టాల్స్‌ను పరిశీలించారు. రక్తహీనత లోపం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం బాలింతలకు శ్రీమంతం చేశారు.

తక్కువ వ్యయంతోనే అధిక పోషకాలు

మాడుగుల రూరల్: తక్కువ వ్యయంతో, ఎక్కువ పోషకాలు అందించే పోషకాహారాన్ని ప్రతి గర్భిణి, బాలింత విధిగా తీసుకోవాలని, కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.నాగదివ్య పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా కింతలి వల్లాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, చోడిపిండి, బెల్లం వంటి వాటితో తయారు చేసిన పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను ప్రదర్శించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, సర్పంచ్ రాంబాయి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో అన్న సమారాధనలు

దేవరాపల్లి: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎ.కొత్తపల్లిలో బుధవారం భారీ అన్న సమారాధన జరిగింది. వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్న సమారాధనను ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మీ, స్థానిక సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు ప్రారంభించారు. అనంతరం అన్న సమారాధనలో భక్తులకు వడ్డన చేశారు. దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ లోని వినాయకుని వద్ద భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడిని స్థానిక ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తదితరులు దర్శించుకున్నారు.

మాకవరపాలెంలో అన్నసమారాధన

మాకవరపాలెం : మండల కేంద్రంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాయుపుత్ర యూత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీకన్య థియేటర్ వద్ద వినాయక మండపం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తామరం, మాకవరపాలెం, రామన్నపాలెం నుంచి భక్తులు హాజరయ్యారు.

అటవీ అమరవీరులకు నివాళులు


అమర వీరులకు నివాళులర్పిస్తున్న అటవీ అధికారులు

గొలుగొండ : కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలో అటవీ సిబ్బంది బుధవారం జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన సిబ్బంది చిత్రపటాలకు పూలమాలతో నివాళులు అర్పించారు. రేంజర్ వెంకట రమణ మాట్లాడుతూ అమర వీరుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

ఎన్ఆర్ఎస్‌టీ స్కూల్‌కి ఉపాధ్యాయుడి నియామకం


పాఠశాల భవనం వద్ద చిన్నారులతో తల్లిదండ్రులు, అధికారులు

రోలుగుంట: అర్ల పంచాయతీ కొంగ శిఖరాగ్ర గ్రామాలైన పీత్రుగెడ్డ, లోసింగ్ గ్రామాల్లో గల ఆదివాసీ చిన్నారుల విద్యాభివృద్ధి కోసం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎన్ఆర్ఎస్‌టీ స్కూలును మంజూరు చేశారు. అక్కడ గ్రామాల వారికి అందుబాటులో జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు పాఠశాల భవనాన్ని మండల విద్యాశాఖాధికారి పూడి జగ్గారావు ఏర్పాటు చేయించారు. ఈ పాఠశాలలో బోధన కోసం డీఎడ్, బీఎడ్ అర్హతలుండి ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను 12 మంది నుంచి స్వీకరించారు. వీరిలో ఏరియా రిజర్వేషన్ అమలు పరిచే భాగంగా ఈ ప్రాంతానికి చెందిన టి.నూకరాజు దొరను ఎంపిక చేసినట్టు ఎంఈవో-2 జగ్గారావు విలేకరులకు తెలిపారు.